క్లుప్తంగా

ప్రభుత్వ విధానాలతో దిగజారుతున్న పేదల బతుకులు



స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు మరింతగా దిగజారిపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్అన్నారు. కరుగోరుమిల్లిలో సీపీఎం జిల్లానాయకులు వత్సవాయి భరద్వాజ్ పునర్నిర్మాణ స్మారక స్థూపావిష్కరణ, 31వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరద్వాజ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జక్కంశెట్టి సత్యనారాయణ, దిగమర్తి సూర్యకుమారి, అల్లం పద్మావతి సూర్యప్రకాష్, కుసుమే జయరాజు, సిర్రా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు దుస్తుల పంపిణీ



దాతలకు వేదాశీర్వచనం అందిస్తున్న పురోహితులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా దాత, ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు కేవీ కృష్ణవర్మ దంపతులు బ్రాహ్మణులకు వస్త్రాలు పంపిణీ చేశారు. గాయత్రి పురోహిత బ్రాహ్మణ సంఘం సభ్యులు నుదురుపాటి శ్రీనివాసు ఆధ్వర్యంలో పురోహితులు దాతకు ముందుగా వేదాశీర్వచనం చేశారు. అనంతరం సుమారు 80 బ్రాహ్మణులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, మేడికొండ శ్రీనివాసు, గజల్ శ్రీనివాసు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, మురహరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో మానవత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం మండల అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు ప్రారంభించారు. మానవత సేవా కార్యక్రమాలు విస్తరణలో భాగంగానే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, కే నరేంద్ర రెడ్డి, టి దివాకర్, మస్తాన్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



ఫిల్టర్ బెడ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం రూరల్: ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటిని కుళాయిల ద్వారా అందించడమే జల్‌జీవన్ మిషన్ కార్యక్రమానికి సంబంధించిన లక్ష్యమని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. బుధవారం ఆయన నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం భారీ తాగునీటి ప్రాజెక్టు వద్ద రూ.2.06 కోట్లతో ఏర్పాటు చేసిన ర్యాపిడ్ సాండ్ వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని మరింత చురుగ్గా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ లోకేష్, నేతలు పొత్తూరి రామరాజు, మేకల సతీష్, చాగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆహార వ్యాపారస్తులకు సేఫ్టీ శిక్షణ సర్టిఫికెట్ ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వీధి వ్యాపారులు ముఖ్యంగా ఆహార పదార్థాలు అమ్మే వారందరికీ ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఫాస్టాక్ ట్రైనర్ కలకండ ప్రవీణ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్టనర్ (కేవీజీవీఎం) ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్వహిస్తున్న, ఆమోదించిన ఫాస్టాక్ శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ప్రవీణ్ మాట్లాడుతూ అన్ని ఆహార పదార్థాలు అమ్మే ప్రతీ వ్యాపారస్తులు కచ్చితంగా ఫుడ్ లైసెన్స్‌తో పాటు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ ఎస్.నాగఉమామహేశ్వరరావు, పట్టణ ఎస్సై జి.ప్రసాద్, కేవీజీవీఎం సౌత్ ఇండియా ఇన్‌చార్జిలు టి.సింధు, సి.మోహన్‌బాబు, జిల్లా టీం హెడ్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు

- రసాయనిక ఎరువులతో తగ్గుతున్న భూసారం
- ప్రకృతి వ్యవసాయంతో సమస్యలన్నింటికీ చెక్

యలమంచిలి: భూతాపం తగ్గాలన్నా, భూసారం పెరగాలన్నా, మనం తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రసాయనిక ఎరువుల వలన భూసారం బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఆ భూములను మళ్లీ సారవంతం చేయాలంటే రైతులంతా ప్రకృతి వ్యవసాయ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. రసాయనిక ఎరువులతో భూసారం తగ్గిన చేలనే కాకుండా చౌడు భూములు సైతం మళ్లీ సారవంతం కావాలంటే రైతులంతా దాళ్వా కోతలు కోసే ముందు నవధాన్యాల సాగు చేయాలి. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుమారు 12 కిలోల బరువున్న నవధాన్యాల విత్తనాల కిట్‌ను రూ.850లకే అందజేస్తున్నారు. ఈ కిట్‌లో 16 రకాల విత్తనాలు ఉంటాయి. ఇలా మిశ్రమ విత్తనాల సాగు వల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతమవుతుంది. దాళ్వా కోతల తర్వాత వేసవిలో ఈ విత్తనాల మొలకెత్తడం వలన భూమి పచ్చ పైరుతో ఉండి భూతాపం తగ్గుతుందన్నారు. దీని వలన భూమిలో తేమ శాతం పెరిగి పంటకు ఉపకరిస్తుంది.

నవధాన్యాలతో భూమి సారవంతం.. నవధాన్యాల సాగుతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నవధాన్యాల సాగుతో భూమికి అధిక పోషకాలు అంది సారవంతమవుతుంది. దీంతో వరి సాగులో పెట్టుబడి తగ్గి రైతులకు అధిక లాభం చేకూరుతుంది. పశువుల పేడ కంటే నవధాన్యాల భూమిని పదిరెట్లు ఎక్కువ సారవంతం చేస్తుంది. ప్రకృతి వ్యవసాయ అధికారులు వ్యవసాయ అధికారులతో కలసి గ్రామాలలో రైతులను ప్రకృతి వ్యవసాయం చేసేలా సన్నద్ధం చేస్తున్నారు. దాళ్వా కోతలకు ముందు చేలలో నవధాన్యాలు చల్లేలా చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం చేసే పెరిగే అవకాశం ఉంది. రైతులు కూడా నవధాన్యాల సాగుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

సాగు చేసే విధానం.. పంట కోయక ముందుగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగం చేసుకుని నవధాన్యాలు విత్తుకోవాలి. తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే చల్లుకోవాలి. నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం. రెండు పంటల మధ్య కాల వ్యవధిలో చల్లుకుని కలియదున్నుకోవచ్చు.



నవధాన్యాలు సాగు చేసిన భూమి

నవధాన్యాల సాగుతో లాభాలెన్నో

- పొలంలో నవధాన్యాలను కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు నత్రజని, సూపర్ ఫాస్ఫేట్ అదనంగా అందుతుంది.
- జింక్ మాంగనీస్, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేకూరుతాయి.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది, వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది.
- లెగ్యుమినేసి జాతికి చెందిన మొక్కలు కావడంతో వాటి వేళ్లో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడంతో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. నేలలో సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో లభ్యం కాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి.
- కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.

భూసారాన్ని పెంచుతాయి



ప్రతి ఏటా నవధాన్యాల సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గి, ఖర్చు పెరుగుతుంది. నవధాన్యాల పైర్ల పెంపకం చాలా సులభమే. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను అందించవచ్చు. ఇవి తక్కువ సమయంలో ఎక్కువ పోషకాలు ఇస్తాయి. నవధాన్యాలు ఎక్కువ నత్రజని శాతం కలిగి ఉంటాయి. భూసారాన్ని బాగా పెంచుతాయి.

– చిందులూరి దేవి, మండల వ్యవసాయాధికారి, యలమంచిలి–

మన ఊరి బడిని కాపాడుకుందాం



మన ఊరి బడిని కాపాడుకుందాం అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: నాణ్యమైన, గుణాత్మకమైన విద్య మీకు అత్యంత అందుబాటులో మన గ్రామంలోనే ఉందని ఇటువంటి మేలైన విద్యను అందిపుచ్చుకోవాలంటే మన గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి రాజశేఖర్ అన్నారు. బుధవారం పోడూరు మండలం గుమ్ములూరు శివారు ప్రాంతం కొత్తపేటలో ఆ పాఠశాల ఉపాధ్యాయులందరూ కలిసి మన ఊరి బడిని కాపాడుకుందాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ దగ్గర్లో మీ ఇంటి చేరువలో ఉన్న పాఠశాలలను వదిలి ఎక్కడో దూరంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపించడం వల్ల పిల్లలు ఒత్తిడికి గురవుతారని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రమాదేవి, డి.క్షేమమూర్తి, డి.మాధవి, ఎస్.కుమార్ రాజా, వి.రజని, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



యలమంచిలి: ఆర్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పాలకొల్లు సెంట్రల్: బాలింతలకు, గర్భిణులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రతి స్త్రీ గర్భం వచ్చిన సమయం నుంచి ప్రసవం తరువాత బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు (వెయ్యి రోజులు గర్భస్థ దశ) ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర కోరారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవాలు సందర్భంగా ఆర్యపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులతో ఆమె సమావేశం నిర్వహించి జాగ్రత్తలు వివరించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, గర్భిణీ సమయంలో బరువు పెరుగుతూ ఉండాలని, హెచ్‌బీ పర్సంటేజ్ పరిశీలించుకోవాలని, తక్కువ మోతాదులో ఎక్కువ ఆహారం తీసుకోవాలని, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని ఆమె కోరారు. ప్రసవం జరిగిన వెంటనే బిడ్డకు ముర్రిపాలు పట్టించాలన్నారు. గర్భిణీ, బాలింత చుట్టూ పరిసరాలన్నీ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఏప్రిల్ 8న ప్రారంభమైన ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాలు ఈ నెల 22 వరకు గ్రామ స్థాయిలో నిర్వహిస్తామని ఆమె వివరించారు. కిషోర బాలికలు చదువు మీద శ్రద్ధ పెట్టాలని ఆమె కోరారు. బాల్య వివాహాలు జరగకుండా 18 సంవత్సరాలు నిండిన తర్వాత అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండిన తర్వాత అబ్బాయికి పెళ్లి చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు కళ్యాణి, జ్యోతి, సుమిత్ర, మహాలక్ష్మి, రజని, రమాదేవి, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పిల్లల్లో ఊభకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని అంగన్‌వాడీ నిర్వాహకులు తెలియజేస్తున్నారు. బుధవారం 7వ పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పాలకొల్లు మండలంలోని కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంఎస్‌కే శ్రీదేవి, జె హైమలక్ష్మి, జి.పావని కుమారి, ఎల్.దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగోత్సవం



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరుడు

పెనుమంట్ర: మార్టేరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మహిళలు ఎరుపు, పసుపు వర్ణం కలిగిన చీరలు ధరించి పూలు, పండ్లు స్వీట్లుతో సారె చీరలను అమ్మవార్లకు సమర్పించారు. ముందుగా వెలగలేరు గ్రామంలో పడాల భాస్కరరెడ్డి వల్లీ శివపార్వతుల దంపతుల ఇంటి నుంచి మేళతాళాలు, కోలాట భజనలతోకాలినడకన బయలుదేరిన మహిళలు మార్టేరులోని మావుళ్లమ్మ గుడిసెంటర్ నుంచి శివాలయం, పోలేరమ్మ పూరిగుడి సెంటర్‌లు మీదుగా ఊరేగింపుగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి అమ్మవార్లకు శ్రీపుష్పయాగోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వేంకటేశ్వరస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివారికి సమర్పించిన 36 కిలోల లడ్డూను వేలంలో ఆలమూరు గ్రామానికి చెందిన బంగారు రాజు అనే రైతు రూ. 36 వేలకు దక్కించుకున్నారు. స్వామివారి తీర్థ మహోత్సవంలో ఆలయ కమిటీ రూ.300 టికెట్‌తో నిర్వహించిన లక్కీడ్రాలో రూ. 1.70లక్షలు విలువచేసే యమహా ఎఫ్–2 మోటారు సైకిల్‌ను మార్టేరు గ్రామానికి చెందిన కర్రి దుర్గా భవానీ అనే మహిళ దక్కించుకున్నారు.

పట్టణ సుందరీకరణలో మున్సిపాలిటీ నిర్లక్ష్యం



రైల్వే స్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల మధ్య మొక్కలు లేకుండా పాడైపోయిన దృశ్యం

నరసాపురం: పట్టణం సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ప్లాట్‌పామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల వద్ద పాతిన మొక్కలు లేకుండా పాడైపోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

‘అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారు’



ఆచంటలో విలేకర్లతో మాట్లాడుతున్న దివ్యాంగుడు ముత్యాలరావు, మద్దతు దారులు

పెనుగొండ: దివ్యాంగుడనని సైతం చూడకుండా రెండేళ్లుగా పనిచేస్తున్న ఆచంట ఉన్నత పాఠశాల వాచ్‌మెన్ ఉద్యోగం నుంచి అన్యాయంగా తొలగించారని చదలవాడ ముత్యాలరావు ఆరోపించారు. బుధవారం ఆచంటలో విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ అగ్రవర్ణానికి చెందిన ఒక వ్యక్తి దళితుడు, దివ్యాంగుడనైన తనను తొలగించి, అదే అగ్రవర్ణానికి చెందిన మరో వ్యక్తిని నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం పోవడంతో కుటుంబం గడవక నానా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు అబద్దాలతో నిరాధార ఆరోపణలు చేసి తొలగించారన్నారు. హెచ్ఎం, ఎంఈఓ కూడా ఈ విషయంలో సాయం చేయలేదన్నారు. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. దివ్యాంగుడికు న్యాయం చేయాలని సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్‌కుమార్, చదలవాడ విజయకుమార్ డిమాండ్ చేశారు.

చోరీ సొత్తు రికవరీ

నరసాపురం రూరల్: ఇటీవల నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం చాగంటివారిమెరకలో జరిగిన చోరీ కేసును పోలీసులు పది రోజుల వ్యవధిలో ఛేదించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా బీరువాలోని బంగారు ఆభరణాల దొంగతనం జరిగింది. ఈ కేసులో ముద్దాయి సి.వెంకట సాయి ని పోలీసులు బుధవారం అరెస్టు చేసి చోరీ సొత్తు 76.50 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

సిద్ధాంతంలో భారీ అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో పార్వతీ సమేత సీత లింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా బుధవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అడ్డగర్ల నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో వందలాది మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం సీత లింగేశ్వర కోలాట భజన సమాజం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దొంగరావిపాలెంలో కొండాలమ్మ ఆలయం వద్ద ఉగాది ఉత్సవాలు ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ తీరుతో ఆరోగ్యశ్రీకి అనారోగ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఆరోగ్య శ్రీకి అనారోగ్యం తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జయసరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీని తొలగించి ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించాలని యోచిస్తుందన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్యశ్రీని అమలు చేస్తే కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అస్తవ్యస్తం చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాం ఆరోగ్యశ్రీను గొప్పగా అమలు చేయడమే కాకుండా ఆరోగ్య ఆసరా పేరుతో రోగుల విశ్రాంతి సమయంలో డబ్బు చెల్లించామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆసరా నిలిపేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ ఆస్పత్రుల పెండింగ్ బిల్లులు చెల్లించి ఈ పథకాన్ని నిరాటంకంగా అమలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లిఖార్జునరావు, హేమలత, హైమావతి, కుమారి, జ్యోతి పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై సీతారాములు



కొప్పర్రులో హనుమద్ వాహనంపై కొలువైన సీతారాములు

నరసాపురం రూరల్: శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కొప్పర్రు సీతారామస్వామి వారి ఉత్సవ విగ్రహాలను హనుమంతుని వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొవ్వాడ ప్రసాద్, ఆంజనేయ ఆచారి గార్ల సమక్షంలో ఈ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు చినిమిల్లి బాబులు, వీరబాబు పాల్గొన్నారు.

రోజువారీ పన్నుల వసూళ్ల వేలం వాయిదా

నరసాపురం: స్థానిక మున్సిపల్ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లకు సంబంధించి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. పాటదారులు వేలం పాడుకోవడానికి ముందుకు రాకపోవడంతో పాటను శుక్రవారం నాటికి వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ప్రకటించారు. మున్సిపల్ మార్కెట్ పాటలో గతంలో ఎన్నడూ లేని విధంగా పాట విషయంలో హైడ్రామా నడుస్తోంది.

19న రన్ ఫర్ జీసస్



రన్‌ఫర్ జీసస్ కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

నరసాపురం: రన్‌ఫర్ జీసస్ పేరుతో ఈ నెల 19న పట్టణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆరాధన టీవీ, రన్‌ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ టి.సంజయ్‌కిషన్ చెప్పారు. కార్యక్రమం నిర్వహణపై బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌కిషన్ మాట్లాడుతూ ప్రతిఏటా ఈస్టర్ పండుగకు ముందురోజు గత 14 ఏళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలకు థామస్‌బ్రిడ్జి ప్రారంభమవుతుందని చెప్పారు. థామస్ బ్రిడ్జి వద్ద నుంచి ర్యాలీ సాగుతుందని, నరసాపురం ఆర్డీఓ వాసి రాజు కార్యక్రమం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ మేరకు కార్యక్రమం మేరకు కరపత్రాలు విడుదల చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులను వినియోగించుకోవాలి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యంగా బీపీ, సుగర్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని క్రమం తప్పకుండా మందులు వాడాలని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉపాధిలో భాగంగా కాపవరం సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ బీపీ, సుగర్ వ్యాధులకు సక్రమంగా మందులు వాడకపోతే గుండెపోటు, కిడ్నీ సమస్యల బారిన పడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుజ్ఞానమణి, యువతేజ, తారకసత్య, సురేష్, మసేనమ్మ, పద్మ, నాగమణి, సుధ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.